క్లుప్తంగా

నేడు మంత్రి ఆర్కే రోజా పర్యటన

నగరి : నగరి మున్సిపాలిటీలోని 17వ వార్డు సచివాలయ పరిధిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మంత్రి ఆర్కే రోజా కార్యాలయం నుంచి మంగళవారం ఓ ప్రకటన వెలువడింది. కరకంతాపురం దళితవాడ, బీసీ కాలనీలో జరిగే ఈ కార్యక్రమంలో మంత్రి ఆర్కే రోజా పాల్గొంటారని పేర్కొన్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

నగరి : మండలంలోని ఏకాంబరకుప్పం సబ్‌స్టేషన్ పరిధిలోని సత్రవాడ, ఏకాంబకుప్పం, అడవికొత్తూరు, తెరణి, మూలనత్తం, చిన్న తాంగళ్ గ్రామాల్లో, మేళపట్టు సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న తడుకుపేట, మునెప్పనాయుడు కండ్రిగ, మీరాసహెబ్ పాళెం, రామాపురం, మేళపట్టు, మిట్టపాళెం గ్రామాలలో బుధవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ లోకనాథరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండ్రాజుకుప్పం దళితవాడ సమీపంలో రైల్వే క్రాసింగ్ కేబుల్ స్తంభం ఏర్పాటుచేయాల్సి ఉందన్నారు. అందువల్ల దానికి అనుసంధానమైన నగరి, మేళపట్టు సబ్‌స్టేషన్లలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ద్విచక్రవాహనం చోరీ

నగరి : పట్టణ పరిధిలోని బాలాజీ హైవే గార్డెన్‌లో ఇంటి ముందు నిలిపి ఉంచిన ద్విచక్రవాహనం చోరీకి గురైన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఆదివారం రాత్రి ఆర్.హబీబ్ అనే వ్యక్తికి చెందిన బజాజ్ పల్సర్ ఏపీ38ఎల్‌యు6662 వాహనాన్ని ఇంటిముందు నిలిపి ఉంచారు. ఉదయం చూసుకోగా బైక్ కనిపించకపోవడంతో చోరీకి గురైనట్లు తెలుసుకున్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు హబీబ్ తెలిపారు.

పౌష్టికాహారం తప్పనిసరి



గర్భిణులకు సూచనలిస్తున్న డాక్టర్ పల్లవి

శ్రీరంగరాజపురం : గర్భిణులు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ పల్లవి అన్నారు. మంగళవారం వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులతో ఆయన మాట్లాడుతూ పాలు, కోడిగుడ్లు, చిక్కీలు, రాగి, గోధుమ, ఎండు ఖర్జూరం తదితరాలను తీసుకోవాలని సూచించారు. పౌష్టికాహారం వ్యాధి నిరోధకశక్తితో పాటు పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. అనంతరం వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి డాక్టర్ సందీప్ రాజు, నర్సు గంగాదేవి, కవిత, చంద్రకళ, డేవిట్ తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లభాషపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కార్వేటినగరం: విద్యార్థులకు ఆంగ్లభాషపై పట్టు ఉండాలని బాలికల ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలు రెడ్డెమ్మ అన్నారు. గ్రంథాలయ వేసవి శిక్షణా కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు ఆంగ్ల భాషపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు రెడ్డెమ్మ మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశానికి వెళ్లి రాణించాలన్నా ఆంగ్లభాషపై తప్పనిసరిగా పట్టు ఉండాలన్నారు. ఇంగ్లిష్ భాష సులభంగా అర్థం కావాలన్నా, ఆంగ్లంలో క్షుణ్ణంగా మాట్లాడాలన్నా గ్రామర్ తప్పనిసరిగా రావాలన్నారు. అనంతరం గ్రంథాలయ అధికారి శంకర్‌బాబు మాట్లాడుతూ ఇంగ్లిష్‌పై నైపుణ్యం కలిగిన వారు అందించే ప్రతి విషయాన్ని విద్యార్థులు తప్పక గుర్తించుకోవాలని, గ్రంథాలయంలో జరిగే వేసవి శిక్షణా తరగతులు విద్యార్థులకు ఓ వరం అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి విద్యార్థి ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, శిరీష, రాఘవేంద్రరాజు, విద్యార్థిని, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం

పుత్తూరు రూరల్: ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం కోరారు. మంగళవారం పుత్తూరు మండల షేర్ ఆటో కార్మికులతో కేబీఆర్‌పురంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బాలసుబ్రమణ్యం ఆటోవాలాలను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్రప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. బ్యాంకు రుణాలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం పోరాట కార్యాచరణను రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్, పురుషోత్తం, నాయకులు ఆర్.వెంకటేష్, ప్రవీణ్‌కుమార్, వెంకటేష్, రమేష్, వేలాయుధం, మహేష్, మురుగ, సుధా, రామలింగం పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు ‘ఉపాధి’

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం గ్రామీణ ప్రజల పాలిట కల్పతరువుగా మారింది. విజయపురం మండలంలో పథకం పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ఇప్పటికే మండలంలో 896 మంది 100 పనిదినాలు పూర్తి చేసుకున్నారు. దీంతో జిల్లాలోనే రెండోస్థానంలో నిలిచింది. ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భజలాలు పెంచేందుకు అధికారులు కందకాలు తవ్విస్తున్నారు. గతంలో తవ్విన కందకాల్లో పూడిక తీత పనులు చేపడుతున్నారు. దీంతో భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంది.

- గ్రామీణ ప్రాంతాల్లో పేదల పాలిట కల్పతరువులా ఉపాధిహామీ పథకం
- ఇప్పటికే విజయపురంలో 100 రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న వారు 896 మంది
- జిల్లాలోనే విజయపురానికి రెండోస్థానం
- తాజాగా భూగర్భజలాల పెంపునకు కందకాలు తవ్వకం, పూడికతీత పనులు



కలియంబాకంలో ఉపాధి పనులు చేస్తున్న మహిళలు

విజయపురం(నగరి): ఉపాధిహామీ పథకం గ్రామీణ ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తోంది. వారం వారం కూలి అందుతుండడంతో కుటుంబాలు ఆర్థికంగా వృద్ధిలోకి వస్తున్నాయి. ఇన్నాళ్లు గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, కాలువల్లో పూడిక తీత పనులు చేయించిన అధికారులు, ఇప్పుడు ఈసారి భూగర్భజలాలు పెరుగుదల కోసం 25 పంచాయతీల్లో కందకాలు తవ్విస్తున్నారు. అంతేగాకుండా మరికొన్ని పంచాయతీల్లో పూడికతీత పనులు చేస్తున్నారు. దీని ద్వారా బోర్లు, బావుల్లో నీటి మట్టం పెరిగే అవకాశం ఉంది.

3 వేల మందికి ఉపాధి..

విజయపురం మండలంలో మొత్తం 25 పంచాయతీలు 126 గ్రామాలు ఉన్నాయి. ఇందులో 4500 మంది కూలీలు ఉండగా, అందులో 3 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నారు. వీరంతా పన్నూరు, కలియంబాకం, మహారాజపురం, విజయపురం, పాతర్కాడు, జంబాడ, సూరికాపురం, జగన్నాథపురం, గంగమాంబపురం తదితర గ్రామాల్లోని అడవుల్లో కందకాలు పనులు చేస్తున్నారు. ఇందులో 80 మంది మహిళలే ఉండడం విశేషం.

ఉపాధిహామీ పనులు ఊపందుకోవడానికి అధికారులు కూడా ఓ కారణం. వారంలో ఒకరోజు ఉపాధి కూలీలకు అవగాహన కల్పించి పనులు కల్పిస్తున్నారు. అంతేకాకుండా రోజుకు రూ.270 కూలి వస్తుండడంతో మహిళలు చాలామంది ఉపాధి హామీ పనులు చేయడానికి ముందుకు వస్తున్నారు. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మండలంలోని ప్రతి మనిషికి 100 రోజులు పని కల్పిస్తారు. పని దినాలను బట్టి రోజుకు రూ.250 నుంచి రూ.270 చొప్పున వారానికి రూ.1500 నుంచి రూ.1600 వరకు కూలి అందుతోంది. తద్వారా మహిళలు ఆర్థికంగా స్థిరపడుతున్నారు. ప్రస్తుతం ఉపాధి హామీ పనులు తమకు ఎంతగానో ఆదుకుంటున్నాయని కూలీలు చెబుతున్నారు. విజయపురం మండలంలో 100 రోజులు పనిదినాలను 896 మంది పూర్తి చేసుకోవడంతో విజయపురం జిల్లాలోనే రెండోస్థానంలో నిలిచింది.

వందరోజులు పనులు ఇస్తాం..



ప్రతి ఉపాధి కూలీలకు వందరోజులు పనులు కల్పిస్తాం. పనిదినాన్ని బట్టి ఒక్కో మనిషికి వారానికి రూ.1500లకు పైగా సంపాదిస్తున్నారు. వంద రోజుల్లో రూ.25 వేలు కూడా సంపాదించుకోవచ్చు. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో కందకాలు పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం 3 వేలమంది పనులు చేస్తున్నారు. మరింతమందికి పని కల్పించడానికి సిద్ధంగా ఉన్నాం.– బబిత, ఏపీఓ, విజయపురం

పని కల్పిస్తున్నారు..



రెండు వారాలుగా పని చేస్తున్నా. నాకు ఒక వారానికి రూ.1560 వచ్చింది. రోజుకు రూ.260 వరకు కూలి వస్తుంది. వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి హామీ పనులు మమ్మల్ని ఎంతో ఆదుకుంటున్నాయి. అధికారులు పని అడిగిన వెంటనే ఇస్తున్నారు.

– జయరాం, విజయపురం, ఉపాధి కూలీ

ఉపాధిహామీ ఆదుకుంటోంది..



మా గ్రామాల్లో వ్యవసాయ పనులు చాలా తక్కువ. పనులు లేక చాలా ఇబ్బంది పడ్డాను. ఇప్పుడు రెండు వారాలుగా ఉపాధిహామీ పనులు చేస్తున్నాను. అడిగిన వెంటనే అధికారులు పని కల్పించారు. అంతేగాకుండా కూలీలకు అవసరమైన వసతులు కూడా కల్పిస్తున్నారు. వంద రోజులకు రూ.20 వేలకు పైగా అందుతోంది. – నాగమ్మ, మంగళం దళితవాడ, ఉపాధికూలీ

సంక్షేమ సారథి సీఎం జగనన్న



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

- ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందిస్తున్నాం
- అక్కచెల్లెమ్మల పేరిట 30 లక్షల మందికి ఇంటి పట్టాలు ఇచ్చాం
- ఎల్లో మీడియా కట్టుకథలు నమ్మవద్దు
- వచ్చే ఎన్నికల్లో జగనన్నను ఆశీర్వదించండి
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): రాష్ట్రంలో ప్రతి గడపకు నవరత్నాల పథకాల ద్వారా లబ్ధి చేకూర్చి ప్ర జల సంక్షేమ సారథిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిలిచారని డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని నల్లేపల్లి సచివాలయ పరిధిలోని పెద్దమిట్టపల్లి, చిన్నమిట్టపల్లి, నల్లేపల్లి దళితవాడ, బీసీ కాలనీ గ్రా మాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదవా రికి పెద్దపీట వేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. డ్వాక్రా మహిళలకు విడతల వారీగా సున్నావడ్డీ, రుణమాఫీ అమలు చేస్తున్నామని, వైఎస్సార్ చేయూత ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ మహిళలు 45–60 ఏళ్లలోపు ఉన్నవారికి ఏ డాదికి రూ.18,750 వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. వైఎస్సార్ కాపునేస్తం ద్వారా రూ.15 వేలు, ఈబీసీ నేస్తం పథకం ద్వారా అగ్రవర్ణాల్లో ఉన్న పేదలకు రూ.15 వేలు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న ఘనత కూడా జగనన్నకే దక్కుతుందన్నారు. అక్కచెల్లెమ్మల పేరుతో దేశ చరిత్రలోనే కనీవినీ ఎరుగని విధంగా 30 లక్షల మందికి ఇంటి పట్టాలు మంజూరు చేశారని, మహిళా రక్షణ కోసం దిశ చట్టాన్ని తీసుకువచ్చి మహిళల రక్షణకు భరోసా కల్పించారని గుర్తు చేశారు. కరోనా సమయంలో ఇచ్చిన మాట కట్టుబడి ఆర్థిక ఒ డిదుడుకులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు అందిస్తు న్న ఘనత కూడా జగనన్నదే అన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ మహిళలను ఓట్ల కోసం వాడుకున్నారే తప్పా వారి అభివృద్ధిని ఎన్నడూ పట్టించుకోలేదని విమర్శించారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకై క ముఖ్యమంత్రి జగనన్న మాత్రమేనన్నారు.

ఎల్లో మీడియా మాటలను నమ్మొద్దు..

కొంతమంది టీడీపీ నాయకులు జగనన్న సంక్షేమ పథకాలను అనుభవిస్తూ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడం సమంజసం కాదని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. సంక్షేమ పథకాలను అడ్డుకోవడ మే ధ్యేయంగా టీడీపీ, జనసేన, ఎల్లో మీడియాలు ఎ త్తుగడలు వేస్తున్నాయని, రానున్న ఎన్నికల్లో ప్రజలే వారిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. టీడీపీ పాలన లో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను నిలువు దోపిడీ చేశారని, ఈ ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదని, నేరుగా వలంటీర్లే ఇంటి వద్దకు వచ్చి అందిస్తున్నా రని తెలిపారు. అనంతరం తమ గ్రామంలో డ్రైనేజీ ఏర్పాటు చేయాలని నెల్లెపల్లి గ్రామస్తులు డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆయన వెంటనే డ్రైనేజీ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేసి పను లు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, ఎంపీపీ అనిత, వైస్ ఎంపీపీ బేబీ, ఏఎంసీ చైర్మన్ బండి కమాలకర్‌రెడ్డి, సర్పంచ్ రవీంద్రరెడ్డి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వెంకటరెడ్డి, మాజీ కన్వీనర్ సురేంద్రరెడ్డి, పట్టాభిరెడ్డి, ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దార్ ఇన్బనాథన్, ఏపీఎం చిరంజీవి, పంచాయతీరాజ్ డీఈ దయాకర్‌రెడ్డి, హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్లు, జిల్లా దేవదాయ కమిషనర్ ఏకాంబరం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న నిర్ణయాలు చారిత్రాత్మకం



జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సీఎం ప్రసంగాన్ని వింటున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కార్వేటినగరం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు అన్ని చారిత్రాత్మకమని జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభ ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందించడంలో, గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల వద్దకు పాలన అందించడంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిన ఘనత జగనన్నదే అన్నారు. గతంలో టీడీపీ పాలనలో ప్రభుత్వ పథకాలు అందాలన్నా, ప్రజలకు చిన్నపాటి న్యాయం జరగాలన్నా, అది జన్మభూమి కమిటీల ఆదేశాల మేరకే జరిగేదని, ఇప్పుడు అలాంటి వాటికి తావు లేకుండా ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని అమలు చేస్తూ యావత్ భారతదేశంలో మన రాష్ట్రం వైపు చూసేలా పాలన అందిస్తున్నారని తెలిపారు. అనంతరం మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు మాట్లాడుతూ ప్రజాభివృద్ధే ధ్యేయంగా పాలన అందిస్తున్న జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్వేటినగరం సర్పంచ్ ధనుంజయవర్మ, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ నాగరాజు, ఈఓపీఆర్డీ లక్ష్మీపతి, చందురాజు, అమీద్, పురుషోత్తంరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ పనిముట్ల దరఖాస్తుల పరిశీలన

విజయపురం (నగరి) : వ్యవసాయ పనిముట్ల కోసం రైతులు చేసుకున్న దరఖాస్తులను ఏఓ రజినికుమారి, బ్యాంకు సిబ్బంది పరిశీలించారు. మంగళవారం సూరికాపురం, ఇల్లత్తూరు, కాళికాపురం గ్రామాల్లో పర్యటించారు. పనిముట్ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతు గ్రూపుల సభ్యులతో ఏఓ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే వ్యవసాయ పరికరాలను రైతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సబ్సిడీ ద్వారా తీసుకున్న పనిముట్లను అద్దెకు ఇచ్చుకుని ఆర్థికంగా ఎదగాలని అన్నారు. అలాగే పనిముట్ల ద్వారా వచ్చే అద్దెతో ప్రతి నెల బ్యాంకు రుణాలను సక్రమంగా చెల్లించుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి త్వరలో పనిముట్లు అందిస్తామని ఆమె తెలిపారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



కోయిల్ ఆళ్వార్ తిరుమంజనానికి సుగంధ ద్రవ్యాలను తీసుకెళుతున్న వేద పండితులు

కార్వేటినగరం: టీటీడీ అనుసంధానంగా ఉంటున్న రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఆలయంలో వేదపండితులు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా వేకువజామున స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు గడ్డకర్పూరం, కిచ్చిలి ఆకు, చందనం, పసుపు వంటి సుగంధ ద్రవ్యాలను కలిపి వేద పండితులు వేదమంత్రాల నడుమ మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయ గర్భగుడిలో గోడలను సుగంధ ద్రవ్యాలను పూసి శుద్ధి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారిని పట్టువస్త్ర సుగంధ భరిత పుష్ప మాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు సురేష్‌బాబు, నాగరాజు(నారాయణవనం)అర్చకులు నారాయణదాసరి, గోపాల ఆచారి, పలువురు పాల్గొన్నారు.

వైభవంగా తిరుపతి గంగ జాతర





ప్రత్యేక అలంకరణలో అమ్మవారు, అమ్మవారిని దర్శించుకుంటున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- అమ్మవారిసేవలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం గ్రామంలో ఉన్న తిరుపతి గంగమ్మ ఆలయంలో మంగళవారం జాతర మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం మహిళలు భక్తి ప్రపత్తులతో అమ్మవారికి అంబలి పోసి ప్రసాదాలను సమర్పించారు. తదుపరి అమ్మవారిని అభిషేకించి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవారి ఉత్సవమూర్తిని పుష్పపల్లకిలో వేంచేపు చేసి అలంకరించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య అమ్మవారి ఊరేగింపు వైభవంగా చేపట్టారు. మహిళలు మంగళహారతులు, కర్పూర నీరాజనాలతో కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. విద్యుద్దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

అమ్మవారిసేవలో మంత్రి నారాయణస్వామి

జాతరను పురస్కరించుకుని ఉప మముఖ్యమంత్రి నారాయణస్వామి మంగళవారం రాత్రి అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు, నిర్వాహకులు మంత్రిని సాదరంగా స్వాగతించి సత్కరించారు. ఆలయంలో మంత్రి పేరిట ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బండి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, గృహ సారథుల మండల కన్వీనర్ బట్టీ సుబ్రమణ్యం, బూత్ కమిటీ నియోజకవర్గ కన్వీనర్ నారాయణరెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, సీనియర్ నాయకులు పేట ధనుంజయరెడ్డి, భీమశంకర్‌రెడ్డి, నరేష్ రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గురవారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ సురేష్‌రెడ్డి, దొరబాబు ఉన్నారు.

ఓంశక్తి అమ్మవారికి అభిషేకాలు



అమ్మవారి ఆలయానికి అంబలి, పూజాసామగ్రిని ఊరేగింపుగా తీసుకొస్తున్న మహిళలు

పాలసముద్రం : మండలంలోని నిశ్శింకాపురంలో వెలసిన ఓంశక్తి అమ్మవారికి మంగళవారం గ్రామస్తులు వివిధ అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారి త్రిశూలనికి పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యితో వివిధ అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం ప్రతి ఇంటి నుంచి మహిళలు అంబలి, పూజాసామగ్రిని పంబవాయిద్యాలతో గ్రామాల్లో ఊరేగించి అమ్మవారి సమర్పించారు. భక్తులు తీసుకొచ్చిన పూజసామగ్రితో అమ్మవారిని సుందరంగా అలంకరించి అంబలి పోశారు. సాయంత్రం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పొంగలు పెట్టి నైవేద్యం సమర్పించారు. అనంతరం అమ్మవారిని వివిధ సుగంధ పుష్పాలతో అమ్మవారిని అలంకరించి కొబ్బరికాయలు కొట్టి, కర్పూరం వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.



అమ్మవారికి అంబలి పోసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

కాలభైరవునికి అభిషేక పూజలు



అభిషేక పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

రేణిగుంట: శ్రీకాళహస్తి ఆలయంలో బుధవారం రాత్రి ఆలయ పండితులు కాలభైరవునికి అభిషేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదమంత్రాలను పఠిస్తూ చందనం, కుంకుమ అభిషేకాలను నిర్వహించి కర్పూర హారతులు సమర్పించారు. భక్తులు అభిషేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించారు.

సమస్యల పరిష్కారానికి ‘జగనన్నకు చెబుదాం’



ఆరూరు సచివాలయంలో జగనన్నకు చెబుదాం ప్రసంగాన్ని వీక్షిస్తున్న ఎంపీపీ దీప, అధికారులు



జగనన్న కాలనీలో తాగునీటి కోసం వేస్తున్న బోరు

నింద్ర: ప్రజా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపడమే లక్ష్యంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మంగళవారం మండల కేంద్రం నింద్రలో ఎంపీపీ దీప లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రయత్నించి పరిష్కారం కాని ప్రజా ఫిర్యాదులు, సంక్షేమ పథకాలకు సంబంధించి, భూసంబంధిత, ప్రభుత్వ సర్వీసులకు సంబంధించి తదితర అంశాలపై నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేసి ప్రజలు తమ సమస్యలను పరిష్కారం చేసుకోవచ్చన్నారు. అందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఈ జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. ఫిర్యాదులు చేయాలనుకునే వారు 1902కు ఫోన్ చేస్తే నేరుగా సీఎం కార్యాలయానికి సమాచారం అంది అక్కడ నుంచి ఒక ఐడీ నంబర్ ఫిర్యాదు చేసిన వారికి ఇస్తారన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి..

నింద్ర: మండల కేంద్రం నింద్రలో ఏర్పాటు అవుతున్న జగనన్న కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ఎంపీపీ దీప అన్నారు. ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం జగనన్న కాలనీలో నీటి వసతి కోసం రెండు బోర్లు వేశామన్నారు. అలాగే ఇళ్ల నిర్మాణాలు కూడా శరవేగంగా జరుగుతున్నాయని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శుభ, ఎంపీడీఓ వేణు, తహసీల్దార్ నాగరాజు, హౌసింగ్ ఏఈ శ్రీధర్‌రాజు, జిల్లా మహిళా కార్యదర్శి మేరి, సర్పంచ్ బాబురెడ్డి పాల్గొన్నారు.

చిదా స్పిన్నింగ్ మిల్లు కార్మికుల ధర్నా



చిదా స్పిన్నింగ్ మిల్లు వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

పుత్తూరు రూరల్: పుత్తూరు చిదా స్పిన్నింగ్ మిల్లును అర్ధాంతరంగా మూసివేయడాన్ని నిరసిస్తూ మంగళవారం కార్మికులు మిల్లు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి సీఐటీయూ యూనియన్ నాయకులు బాబు మాట్లాడుతూ 2022 ఫిబ్రవరిలో లేబర్ డిపార్ట్‌మెంట్ సమక్షంలో కార్మిక సంఘ నాయకులు, యాజమాన్యం మధ్య కుదిరిన వేతన ఒప్పందం ప్రకారం నాలుగేళ్ల పాటు మిల్లును యథావిధిగా నడపాలని డిమాండ్ చేశారు. కానీ మిల్లు యాజమాన్యం ఏకపక్ష నిర్ణయంతో మిల్లు మూసివేయడంతో 171 మంది రెగ్యులర్ కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో 250 మంది తాత్కాలిక మహిళా కార్మికులు సైతం తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. కార్మిక సంఘాల మధ్య చిచ్చు పెట్టి యాజమాన్యం పబ్బం గడుపుకోవాలని చూస్తోందని ఆరోపించారు. దీన్ని ప్రతి కార్మికుడు వ్యతిరేకించి తమ హక్కులను కాపాడుకోవాలని కోరారు. కార్మికులకు జరుగుతున్న అన్యాయంపై తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు రాజేంద్ర, మనోహర్, కాటయ్య, సీఐటీయూ యూనియన్ నాయకులు బాబు, నాగూర్, టీఎన్‌టీయూసీ నాయకులు ఏలుమలైరెడ్డి, సమాచారం హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు తప్పనిసరి



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మోహన్‌కృష్ణ

పాలసముద్రం : మండల పరిధిలోని ప్రతి గర్భిణులు సకాలంలో వైద్యపరీక్షలు చేసుకుంటేనే మాతాశిశు మరణాలు జరగవని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. మంగళవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంగా గర్భిణులకు అన్నిరకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. గర్భిణులకు హిమోగ్లోబిన్, బ్లడ్ షుగర్, బ్లడ్ గ్రూపింగ్, వీడీఆర్ఎల్, హెచ్‌ఐవీ, హెచ్‌బీఎస్‌ఏజీ వంటి పరీక్షలు చేశారు. డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారంతో పాటు మజ్జిగ, పండ్లరసం, ఆకుకూరలు, ఎక్కువగా నీరు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు నెలసరి వైద్యపరీక్షలు తప్పక చేసుకోవాలన్నారు. అనంతరం 35 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ సుశీల, మురళి, గర్భిణులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే మంచి భవిష్యత్



విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్ వినాయకం

పాలసముద్రం : ఉన్నత ప్రమాణాలు, నాణ్యమైన విద్య కావాలంటే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలని పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వినాయకం అన్నారు. మంగళవారం అధ్యాపకులు రెండు గ్రూపులుగా విడిపోయి పాలసముద్రం, సీఎం కండ్రిగ, సింహరాజుపురం గ్రామాల్లో పదో తరగతి పాసైన విద్యార్థుల తల్లిదండ్రులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లెక్చరర్లు సుశీల, రేవతిబాయి మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉంటారని, అడ్మిషన్ ఫీజు తప్ప ఇతర ఫీజులు చెల్లించాల్సిన పనిలేదన్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, అర్హులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం, బస్సు పాసు సౌకర్యం ఉన్నాయన్నారు. అందువల్ల మీ పిల్లలను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలన్నారు. ప్రైవేటు కళాశాలలో చేర్పించి డబ్బులను వృథా చేయరాదని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ కళాశాలల్లో చదివిన విద్యార్థులే ఉన్నతస్థాయిలో ఉన్నారని గుర్తు చేశారు. కళాశాల అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.